క్లుప్తంగా

తలరాతను మార్చేది పుస్తకం

ప్రముఖ కవి వెంకటేశ్వర్లు



కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పుస్తకం చదివితేనే తలరాత మారుతుందని ప్రముఖ కవి ఎర్రోజు వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీవాణి సాహిత్య సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం పుస్తకావిష్కరణ, కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 'చెప్తే సగం ఇవ్వాలి', 'శ్రీ శుభమస్తు', 'మంగళ హారతులు' పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పెందోట వెంకటేశ్వర్లు, మిట్టపల్లి పరశరాములు, సత్యలక్ష్మి, వర్కోలు లక్ష్మయ్య, మౌన స్వామి, గడ్డం బాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా



యూరియాను పరిశీలిస్తున్న మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక): యూరియా అందుబాటులో ఉందని, రైతులు అధైర్య పడొద్దని మండల వ్యవసాయ అధికారి మల్లేశం చెప్పారు. మిరుదొడ్డి పీఏసీఎస్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. కేంద్రానికి వచ్చిన 20 మెట్రిక్ టన్నుల డీఏపీఎస్, 20 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రాజు, ఏఈఓలు అఖిల్, ప్రశాంత్, రేఖ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన రసీదులను పరిశీలించారు. అధిక రేట్లకు అమ్మితే చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు.

కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు తిప్పొద్దు



ఎస్‌ఐ అరుణ్ కుమార్

దౌల్తాబాద్(దుబ్బాక): కేజీవీల్స్ అమర్చిన ట్రాక్టర్లను రోడ్డుపై నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ అరుణ్ కుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ కేజీవీల్స్ వల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానులు పోలీసుల సూచనలను విధిగా పాటించాలని చెప్పారు. వ్యవసాయ పనులు ఉంటే కేజీవీల్స్‌ను పొలం వద్దకు వెళ్లి అక్కడే అమర్చుకోవాలని సూచించారు.

పోషకాహారం తప్పనిసరి



చిన్నారులకు అక్షరాభ్యాసం

గజ్వేల్: చిన్నారులకు తప్పనిసరిగా పోషకాహారం అందించాలని వైద్యారోగ్యశాఖ గజ్వేల్ సబ్ యూనిట్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన చిన్నారుల అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించి వారి ఎదుగుదలకు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు రజని, మణెమ్మ, వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రేమ్‌చందర్, దుర్గాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుళ్లకు సన్మానం



కానిస్టేబుళ్లు సరిత, శ్రావణిని సన్మానిస్తున్న జాగృతి ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

కొండపాక(గజ్వేల్): కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను దుద్దెడలో జాగృతి ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం సన్మానించారు. పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా ప్రతీయేటా నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగంగా దుద్దెడకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు శ్రావణి, సరితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొజ్జ మహదేవ్, సభ్యులు బ్రహ్మచారి, వెంకటరమణ, పబ్బోజు రాజయ్య, శ్రీనివాస్, వడ్లకొండ శ్రీనివాస్, కాట రమేశ్, పెద్దంకుల శ్రీనివాస్, నాగరాజు, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కాదు కాదు..100 ఫీట్లే!

- 45 అడుగులంటూ నిర్మాణాలు తొలగించి సైడు కాల్వలు కూడా పూర్తి చేశారు.
- వంద అడుగులేనంటూ మళ్లీ ట్విస్ట్

రహదారి విస్తరణ ఆయోమయం



చేర్యాలలో కొనసాగుతున్న స్వచ్ఛంద కూల్చివేతలు(ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి 365–బి విస్తరణ పనులు ప్రారంభమై రెండేళ్లు కావస్తోంది. కానీ పనులు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ప్రారంభం నుంచి రోడ్డు వెడల్పు ఎంత అన్న అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అధికారులు రోడ్డుకు రెండు వైపులా 45 ఫీట్ల వరకు నిర్మాణాలు తొలగించి సైడ్ కాల్వలు కూడా నిర్మించారు. సాధారణంగా ఈ కాల్వల నిర్మాణం పూర్తయిందంటే రోడ్డు విస్తరణ పూర్తయినట్టేనని అంతా అనుకున్నారు. అందుకు తగ్గట్టు స్థానికులు కూడా తమ నిర్మాణాలను సరి చేసుకున్నారు.

అధికారుల ట్విస్ట్!

అయితే అధికారులు స్థానికులకు మరో ట్విస్ట్ ఇచ్చారు. రోడ్డు 100 ఫీట్లు ఉండాల్సిందే అని మళ్లీ కూల్చివేతలు ప్రారంభించారు. దీంతో ఏమి చేయాలో దిక్కు తోచని స్థానికులు నిర్మాణాల కూల్చివేతలు ఆపించాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ చామల కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కోరారు.

ప్రజలకు తప్పని తిప్పలు

ఇలా కొందరి పట్టుదల, అధికారుల నిర్లక్ష్యం వల్లే రోడ్డు విస్తరణ పనులు పూర్తికావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, రోడ్డు విస్తరణ అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

తేల్చుకోలేని స్థితిలో స్థానికులు

కొందరు ఆపాలని కోరుతుంటే.. మరి కొందరు మాత్రం స్వచ్ఛందంగా తమ ఇళ్లను కూల్చివేస్తున్నారు. ఇలా కొందరు ఆమోదించి కూల్చివేస్తుంటే మరి కొందరు అడ్డుకుని తీరుతాం అని పెడుతున్న పోస్టులు సోషల్ మీడియాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో స్వచ్ఛందంగా కూల్చివేసుకున్న వారు మాత్రం ఒకింత అయోమయానికి గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్, జాతీయ రహదారి అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

నిబంధనల మేరకే పనులు

జాతీయ రహదారి విస్తరణ పనులు నిబంధన మేరకే జరుగుతాయి. 100 ఫీట్ల వరకు ఉన్న నిర్మాణాలను కూల్చడం ఆపివేయాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు. యజమానుల కోరిక మేరకు సమయం ఇచ్చాం. నిర్ణీత గడువు అనంతరం నిబంధనల ప్రకారం రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతాయి.

– స్వప్న, ఆర్‌అండ్‌బీ ఏఈ

రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మైసమ్మవాగుతండా గ్రామ పరిధిలోని మబ్బుకుంట, రంగన్నకుంట మధ్యలో కోతకు గురైన రోడ్డుకు శనివారం మరమ్మతులు చేయించారు. 'ప్రయాణం.. ప్రమాదకరం' అనే శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి గిరిజనశాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా అక్కన్నపేట అదేవిధంగా రోడ్డుకు రెండు వైపులా పడిన గండ్లను కూడా పూడ్చారు. నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు పనులు చేయించాలని, మరలా గండ్లు పడకుండా చూడాలని తండావాసులు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పలువురు యువకులు చెప్పారు.

పిచ్చి మొక్కల తొలగింపు



గడ్డిని, పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

దుబ్బాకటౌన్: పట్టణంలో 17వ వార్డులో మురుగు కాలువలకు రెండు వైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఎట్టకేలకు తొలగించారు. 'పిచ్చి మొక్కలు.. తప్పని తిప్పలు' అనే శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. దీంతో వార్డు ప్రజలు సాక్షికి కతజ్ఞతలు తెలిపారు.

రేపు ఇంటర్మీడియెట్ స్పాట్ అడ్మిషన్లు

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం ఇంటర్మీడియెట్‌లో చేరేవారికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫస్ట్ ఇయర్‌లో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్స్ ఇంగ్లిష్ మీడియంలో ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థినులు సోమవారం కళాశాలకు వచ్చి అడ్మిషన్‌లు పొందాలని సూచించారు.

సైనికుల సేవలు మరువలేనివి



జవాన్ నరసింహనాయక్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): దేశం కోసం వీర మరణం పొందిన సైనికుల సేవలు మరువలేనివని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ కొనియాడారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మరణం పొందిన రాజుతండాకు చెందిన వీర జవాన్ గుగులోతు నరసింహానాయక్ విగ్రహం వద్ద శనివారం ఆయన తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. స్వామి వివేకనంద యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు రాష్ట్రస్థాయి యువజన అవార్డు గ్రహీత సత్తయ్య, రాంచందర్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవ చేసే అవకాశం ఎంతో గొప్పది

గజ్వేల్‌రూరల్: దేశ సేవ చేసే అవకాశం రావడం ఎంతోగొప్పదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు అన్నారు. కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా కళాశాలలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మహేందర్‌రెడ్డితో కలిసి కార్గిల్ యుద్ధంలో మరణించిన వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భారత సైన్యంలో చేరేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కాడెట్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడటం సరికాదు

చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



అంత్యక్రియల్లో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

తొగుట(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కోవాలి కాని ఆత్మహత్యకు పాల్పడటం సరికాదని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బండారు చిన్న మహేశ్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలుసుకున్న ఆయన శనివారం కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ పెద్దదిక్కు ఆత్మహత్యకు పాల్పడితే కుటుంబం రోడ్డున పడుతుందన్న విషయాన్ని మరవవద్దన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. ఇద్దరు కూతుళ్ల చదువులకు తనవంతు సహాయం అందిస్తానని చెప్పారు. దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాందారి నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు తిరుపతి, నిరంజన్, నర్సింహులు, యాదగిరి, కనకయ్య, రామస్వామి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



మట్టి తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటజోన్: పట్టణంలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షం నేపథ్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ పలు లోతట్టు ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నాయకంనగర్ ప్రాంతంలో నివాసాల మధ్య పెద్ద ఎత్తున వరద నీరు నిల్వ ఉండడంతో జేసీబీ సహాయంతో వరద కాల్వను దగ్గర ఉండి శుభ్రం చేయించారు. పేరుకుపోయిన మట్టిని పారిశుద్ధ్య కార్మికులు తొలగించి నీటి ప్రవాహానికి మార్గం సులభం చేశారు. అనంతరం పలు వార్డుల్లో పరిశీలించారు. వర్షాల వల్ల సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబరు 950507248కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన గృహాల్లో ఉండే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. అధికారులు వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ ప్రేరణ, అధికారులు పృథ్వి ప్రవీణ్ స్రవంతి, భరద్వాజ్, కౌన్సిలర్ వినోద్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఈత మొక్కలు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ కిరణ్

చిన్నకోడూరు(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట): ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎక్సైజ్ ఎస్‌ఐ కిరణ్ పిలుపునిచ్చారు. చిన్నకోడూరు మండల పరిధిలోని మాచాపూర్ గ్రామంలో శనివారం ఈత మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు కాలుష్యం నుంచి రక్షించడమే కాకుండా ప్రశాంత వాతావరణంలో జీవించగలుగుతామన్నారు. ఈత వనాలు గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తాయన్నారు. బెజ్జంకి మండలంలోని బేగంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ రూప పాల్గొని ఈత మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు సత్తయ్య, లక్ష్మణ్, అంజయ్య, రవి, తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

ప్రొజెక్టర్ అందజేత



ప్రొజెక్టర్ అందజేస్తున్న బహుజన మిత్ర మండలి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంకు బహుజన మిత్ర మండలి సభ్యులు శనివారం ప్రొజెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కిషన్ మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ ప్రాసెస్‌లో ఈ ప్రొజెక్టర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీచర్లు శ్రీనివాస్, బాలకృష్ణ, రాజేశ్వరి, బహుజన మిత్ర మండలి సభ్యులు శ్రీనివాస్, హరికృష్ణ, ప్రభాకర్, గణేశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భూంపల్లిలో ఇటీవల మృతి చెందిన రెండు బాధిత కుటుంబాలను మండలి సభ్యులు పరామర్శించి ఒక్కో కుటుంబానికి 50 కిలోల చొప్పున బియ్యం అందించారు.

పంటచేలో నీరు నిలువనీయొద్దు

వ్యవసాయాధికారులు

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలిగే నష్టాలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తల గుర్తించి వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. పలు మండలాల్లో శనివారం వివిధ పొలాలను పరిశీలించారు. కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు.



అక్కన్నపేట(హుస్నాబాద్): నాట్లు వేస్తూ అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శ్రీలత



చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ జయంత్ కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గండిపల్లి పరిధిలోని బోరింగ్‌తండాలో భూక్య సితియా అనే రైతు వరి నాట్లు వేస్తుండగా వ్యవసాయ విస్తరణాధికారి కరంటోతు శ్రీలత పొలం వద్దకు వెళ్లి స్వయంగా నాటేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసిన ప్రాంతాలలో పొలం నుంచి మురుగునీటిని తీసివేయాలన్నారు. నాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరన్ 3జీ గులికలను ఇసుకలో కలిపి చల్లినట్లయితే ప్రధాన పొలంలో పంటను 15 నుంచి 20 రోజుల వరకు కొన్ని రకాల పురుగుల నుంచి కాపాడుకోవచ్చు అని చెప్పారు.

మెలకువలు పాటించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్ మాట్లాడుతూ వర్షాలు తగ్గిన తర్వాత వరితోపాటు ఆరుతడి పంటలైన పత్తి, మొక్కజొన్న, కంది ఇతర పంటలకు నత్రజని, డీఏపీ ఎరువులు వేసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిని బయటకు పారదోలాలని సూచించారు. ముంపుకు గురైన పంటలు కోలుకోవడానికి వర్షాలు తగ్గిన తర్వాత 19.19.19 లేదా, 13.0.45 ఒక ఎకరానికి ఒక కిలో 200 లీటర్ల నీటికి కలుపుకొని వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. అలాగే కంది పంటకు వర్షాల కారణంగా ఎండు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. కాబట్టి రెండు గ్రాముల మెటల్ ఆక్సిల్ మందును లీటర్ నీటికి కలుపుకుని నేల తడిచే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. పత్తి సాగులో నేల ద్వారా వ్యాప్తి చెందే తెగులును నివారించడానికి మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపి నేల తడిచే విధంగా వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని చెప్పారు.

జాగ్రత్తలు తీసుకోవాలి: ఏఓ మోహన్

తొగుట(దుబ్బాక): మండలంలోని బండారుపల్లిలో రైతు చెప్యాల రాజు పత్తిపంటను ఏఓ మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి పంటలో వేరు నల్లగా మారినట్లెతై వర్షాలు తగ్గుముఖం పట్టాక సస్యరక్షణ చర్యలు చేపట్టాన్నారు. మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ అనే మందు వేరు మొదట్లో పడేలా స్ప్రే చేయాలని చెప్పారు. వరి పంటలో మొగి పురుగును అరికట్టేందుకు ఎకరా నారుమడిలో ఒక కిలో కార్బోఫురన్ గుళికలు వాడాలని, నాటువేసిన తర్వాత ఎకరాకు 10 కిలోల కార్బోఫురన్ గుళికలు వాడాలని సూచించారు. ఏఈఓ నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు తగ్గించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): సాగులో రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి, పచ్చి రొట్ట ఎరువులు ద్వారా భూసారం పెరిగి మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ అన్నారు. రామంచలో వరి, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అవసరం మేరకు వాడాలని రైతులకు సూచించారు. మొక్కజొన్నలో వర్షపు నీటిని తొలగించి 20 గ్రాముల డీఏపీని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కత్తెర పురుగు నివారణకు ఒక కిలో సున్నం, 9 కిలోల ఇసుక కలిపి మొక్కసుడులలో వేయాలన్నారు. వరి, మొక్కజొన్న సాగులో చీడపీడలు, నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీలో చేరేందుకు 31 వరకు గడువు

గజ్వేల్‌రూరల్: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు 31 వరకు చివరి గడువు ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ బీఏ, బీకాం(కంప్యూటర్స్), బీఎస్సీ(ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంబీజెడ్‌సీ, ఎంసీసీఎస్, బీజెడ్‌సీ) కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఇంకా డిగ్రీలో చేరని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 3న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 6లోగా కళాశాలలో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

అతిథి ఉపాధ్యాయులకు..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్‌ఎస్)లో ఖాళీగా ఉన్న హిందీ, పీఈటీ అతిథి ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి ఇమ్రానబేగం శనివారం తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు 31లోగా పాఠశాల (96407 63713)లో సంప్రదించాలని సూచించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

చేర్యాల(సిద్దిపేట): అన్నిదానాల కన్నా.. విద్యాదానం మిన్న అని ఆకునూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అయోధ్య అన్నారు. షిరిడీ సాయిబాబాట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు శనివారం రూ.28 వేలు విలువైన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు సహాయం చేయడం చాలా అభినందనీయం అన్నారు. పాఠశాల చైర్మన్ రాజేశ్వరి, అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు



తొగుట మండలం ఘనపూర్‌లో దెబ్బతిన్న ఇల్లు



వర్గల్(గజ్వేల్): మైలారంలో పైకప్పు కూలిన ఇల్లు

ఎడతెరిపినలేని వర్షాలతో జనావాసాలు తడిసి ముద్దవుతున్నాయి. పాత ఇళ్లు ప్రమాదకరంగా మారాయి. శనివారం వర్గల్ మండలం మైలారంలో పోతగల్ల నర్సమ్మకు చెందిన పెంకుటింటి పైకప్పు కొంతమేర కూలిపోయింది. తొగుట మండలంలోని చందాపూర్, ఘనపూర్ గ్రామాల్లోను ఇళ్లు కూలినట్టు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. చందాపూర్‌లో నర్సెట్టి మల్లవ్వ, ఘనపూర్‌లో పెద్దపులి రాజవ్వ ఇళ్లు కూలిపోయినట్టు చెప్పారు. సాయంఅందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఆదుకున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు



ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

బెజ్జంకి(సిద్దిపేట): ఇటీవల మరణించిన బేగంపేటకు చెందిన ఎగోళం రాజేశం కుటుంబానికి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు అండగా నిలిచారు. రాజేశంతో పాటు అతని కూతుర్లు నిహారిక, హర్షిత అదే పాఠశాలలో చదువుకున్నారు. తండ్రి మరణంతో కుంగి పోతున్న వారిని రాజేశంతో కలిసి చదువుకున్న మిత్రులు శనివారం పరామర్శించి రూ.71,711 ఆర్థిక సాయం అందించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు ఆ చిన్నారులకు రూ.10,500 అందజేశారు. అలాగే మరో పూర్వ ఉపాధ్యాయుడు పుల్లూరి ప్రభాకర్ పాలిటెక్నిక్ చదువుతున్న నిహారికకు ఫీజు, పుస్తకాలకు అవసరమయ్యే డబ్బులు ఇస్తానని హామీ ఇచ్చారు.

యూరియా అందుబాటులో ఉంచండి

పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): వానాకాలం సాగులో భాగంగా తగినంత యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని రేబర్తి పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని లద్నూర్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియాను అందించడంలో మండల వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ విఫలమయ్యారన్నారు. ప్రైవేట్ డీలర్‌లకు యూరియాను అందిస్తున్నారని, రైతులకు మాత్రం సకాలంలో తగినంత యూరియా అందకుండా చేస్తున్నారని ఆగ్రహించారు. రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తగినంత యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.